6

# దేవుడు ఎంతో ఉత్తముడు!

## (3:22-39)

నడికారు స్త్రీకి కేన్సర్ వచ్చినట్టు తేలింది. రసాయనాలతో జరిగే చికిత్స అనంతరం శస్త్ర చికిత్స జరగాలని వైద్యం నిర్ణయించింది. ఆపరేషన్ తరువాత ఆమె తిరిగి ఆస్పత్రి గదిలోనికి తేబడింది. మత్తునుండి ఆమె తేరుకొంటూ ఉండగా, ఆమె కుటుంబ సభ్యులు ఆ గదిలోనికి అనుమతించబడ్డారు. మెల్లగా స్పృహరాగా, ఆ గదిలో తన కుటుంబ సభ్యులను చుట్టూ తేరి చూచింది. "దేవుడు ఉత్తముడు కాదా?" అని ఆమె చిరునవ్వుతో చెప్పింది.

విలాపవాక్యములు 3:1-18లో, యిర్మీయా యొక్క మహా దుఃఖము వర్ణనాతీతంగా ఉంది, ప్రస్తుతపు వాస్తవముగాక, దేవుడు దూరపు జ్ఞాపకంగా ఉన్నట్టు ఆ మాటలు చిత్రించాయి. "దీనంతటిలో దేవుడు ఎక్కడున్నాడు?" అనేది ప్రవక్త మనోభావన యొక్క వేదనయై ఉంది.

విలాపవాక్యముల మూడవ మధ్య భాగం శిఖరాగ్రము. మహావేదన అనే లోయలో నుండి అధిరోహించుతుంది. బాధతో సోలిపోయిన స్థితిని అధిగమించి, దేవుని సముఖాన్ని తిలకించడానికి (చూచుటకు) యిర్మీయా ఆరంభించాడు. ఇంతసేపు దేవుడు అక్కడే ఉన్నాడు. బాధించే సంభవాలయందును వాటి చుట్టును ఆయన ఉన్నాడు. ఆ సంఘటనలలో ఏదియు ఆయన దృష్టిని తప్పించుకోలేదు. ఆయన దూరంగా ఉన్నట్టు అనిపించినందున, దేవుడు చూడడం లేదని కాదు, కాని యిర్మీయా ఆయన ప్రసన్నతను ఎరుగకున్నాడు. ఎట్టకేలకు, దేవుని ప్రసన్నతను గుర్తించడంవలన యిర్మీయాకును, యూదా జనులకును నిరీక్షణ ప్రసాదింపబడింది.

బైబిలు సంభవాలు, సంఘటనలన్నిటిలో జరిగినట్టే, యిర్మీయా యొక్క విలాపములు ఎక్కువగా యూదావారి మహా వేదనలను గూర్చి గాక, దేవుని స్వభావాన్ని గూర్చి తెలుపుతున్నాయి. యూదావారి మహా వేదన కేవలము రంగస్థలపు అమరిక మాత్రమే. ఈ పరిస్థితిలోనుండి దేవుని నిజమైన స్వభావము బయలుపరచబడింది. యిర్మీయాను బాధించిన సంఘటనల యొద్దకు ఎంత సమీపంగా వస్తామో, అంత సన్నిహితంగా మనం దేవుని చూస్తాం. దేవుడు ఎవరైయున్నాడో, ఆయనకు మనం ఎలా ప్రత్యుత్తరమియ్యాలి అనేదాన్ని గూర్చినదే విలాపవాక్యములు 3:22-39.

### దేవుని నాలుగు లక్షణాలు

దేవుని స్వభావాన్ని గూర్చిన నాలుగు రమ్యమైన ఆదరణతో కూడిన వాస్తవాలలో

యిర్మీయా యొక్క నిరీక్షణ చుట్టబడింది; అవి 3:22-25ఎ ల్లో సంగ్రహం చేయబడ్డాయి.

> యెహోవా కృపగలవాడు; ఆయన వాత్సల్యత యెడతెగక నిలుచునది గనుక మనము నిర్మూలము కాకున్నవారము. అనుదినము నూతనముగా ఆయనకు వాత్సల్యత పుట్టుచున్నది; నీవు ఎంతైన నమ్మదగినవాడవు. యెహోవా నా భాగమని నేననుకొను చున్నాను; ఆయనయందు నేను నమ్మికయుంచుకొనుచున్నాను. తన్ను ఆశ్రయించు వారియెడల యెహోవా దయాళుడు; తన్ను వెదకువారియెడల ఆయన దయచూపువాడు.

మొదటిది ఆయన వాత్సల్యత: యెహోవా "వాత్సల్యత యెడతెగక నిలుచునది" (22ఎ వ.). "వాత్సల్యత" అనే తర్జుమా చేయబడిన హెబ్రీ పదం ఒక మాటతో తర్జుమా చేయడం కష్టం. అది కొన్నిసార్లు "కృప"[1] మరి కొన్నిసార్లు "కనికరము" అనే మాటగా తర్జుమా చేయబడింది.

పొందవలసిన శిక్షను దేవుని కనికరము తొలగిస్తుంది. ఆయన కనికరము శిక్షకు పరిమితి (హద్దు) ఏర్పరచి, చివరిగా, "చాలును" అని అంటుంది! న్యాయము అంటే, జనులు దేనికి పాత్రులో దాన్ని పొందేలా చూస్తుంది. కనికరము న్యాయాన్ని హద్దులో ఉంచుతుంది, తగిన స్థితికి తెచ్చి భరించగలుగునట్లుగా చేస్తుంది. బాధ, జరుగవలసిన న్యాయము అనే సందర్భంలోనుండి దేవుని కనికరము వస్తుంది. అది ఆయన న్యాయాన్ని పాలించడంలో నీతిమంతుడు ప్రేమామయుడన్న సంగతిని బయలుపరచుతుంది. న్యాయంలో కూడ దేవుడు మన అత్యున్నతమైన క్షేమాన్ని వెదుకుతుంటాడని కనికరము బయలుపరచుతుంది. దేవుడు ఉత్తముడు కాడా?

రెండవది, దయ: "ఆయన వాత్సల్యము యెడతెగక నిలుచునది" (22బి వ.), "వాత్సల్యము" అనే పదం కూడ నిర్వచనాన్ని తప్పించుకొంటుంది. కనికరము అనే దానిపైన విస్తరించి వివరిస్తుంది. వాత్సల్యము అంటే దయతోకూడిన ప్రేమ, నిస్సహాయులు లేక బాధలోనున్న వారిపట్ల గాఢమైన దయ. కొన్నిసార్లు "కనికరము," "దయ" అనేవి పర్యాయ పదాలుగా వినియోగించబడతాయి. కనికరములో కార్యాచరణ ఉంటుంది, దయలో ఎక్కువగా ఉద్వేగముంటుంది. కనికరమునకు కారణమే దయ. ఈ రెండును దేవుని ప్రేమయొక్క అంతములేని నిలకడగా ఉండు స్థితి.

దేవుని దయ కనికరములకు రుజువులు (అనుదినము) ప్రతి ఉదయము నూతనముగా కన్పిస్తున్నాయి. ప్రతి అరుణోదయమున అవి నూతనముగాను తాజాగాను ఉన్నాయి. సూర్యుడు ఉదయించి ఎంత నిశ్చయంగా నూతన దినాన్ని తెస్తాడో, దేవుని వాత్సల్యము కూడ తన ప్రజలకు అలాగే ఆదరణ తెస్తుంది. ప్రతి ఉదయమునా? అవును! దేవుని కనికరము ఎన్నడూ తరుగదు; అది ప్రతి దినము ఆరంభమౌతుంది. (యెషయా 33:2 చూడు.)

పట్టణపు వాసియైన ఒక యువకుడు ప్రతి వేసవిలో పల్లెలో ఉండే తన తాతగార్ని దర్శిస్తూ ఉంటాడు. కొండలను ఎక్కుతూ దిగుతూ, గుంటలో చేపలను పడుతూ, చిన్న కాలువలో ఈతకొట్టుతూ, బయట రోజంతా ఆడేవాడు. ఆవుల పాలు తీస్తూ, గుడ్లను పోగుచేస్తూ, పశువులకు మేతవేస్తూ తన తాతగార్కి సహాయం చేసేవాడు. రాత్రులు మాత్రం భయపడుతూ, లోపలికి వెళ్లడానికి, నిద్రపోటానికి భయపడేవాడు. దృశ్యాలను

చూడడంలోగాని, పొలంమీద పనులు చేయడానికి గాని అతడెన్నడూ అలసిపోయేవాడు కాడు. ప్రతి ఉదయము, పడకమీదనుండి "దిగ్గున లేస్తాడు!" కిటికీలోగుండా సూర్యో దయాన్ని చూచి "సంతోషిస్తాడు!" త్వరగా బట్టలు ధరించుకుంటాడు, మరో దినం ఆరంభించడానికి యింటనుండి అతడు త్వరగా బయటికి వెళ్లిపోతాడు.

దేవుని కనికరమునందలి విశ్వాసములో, అనుదినము నూతనమైనదియు తాజా తనముతో కూడినదియునైయుంటుంది. అనుదిన జీవితంలో నీవు "ఉత్సాహాన్ని" పెట్టవచ్చు! అవును, దేవుడు ఉత్తముడు, మంచి దేవుడు.

తరువాత, మనము విశ్వాస్యతను చూస్తాం: "నీవు ఎంతైన నమ్మదగినవాడవు" (23బి వ.). దేవుని నమ్మదగినతనం, దేవుని ఘనతను మరో అడుగు ముందుకు త్రోస్తుంది (లేక పైకి నెట్టుతుంది). నీవు ఆయనమీద ఆధారపడవచ్చు. ఆయన అక్కడ ఉంటాడనే పూర్ణమైన నిశ్చయతతో, సంపూర్ణంగా ఆయన మీద నమ్మకం పెట్టుకోవచ్చు. కనికరమును దయను చూపుటలో దేవుడు పరిపూర్ణంగా నమ్మదగినవాడని గుర్తించడం కంటె మరింత నిశ్చయత మరేముంటుంది? ఆయన తన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటాడు. ఆయన ఏమైయున్నాడో నిరంతరం ఆయన అదే అయ్యున్నాడు. ఆయన పరిపూర్ణుడు గనుక తానైయున్నదాని కంటె ఆయన ఎక్కువగాని తక్కువగాని అయ్యుండడు.

22-24 వచనాలలోనుండి మన గొప్ప క్రైస్తవ కీర్తన వచ్చింది:

> దృఢమైన ప్రభువు ప్రేమ ఎన్నడు మానదు,
> ఆయన కనికరములు ఎన్నడును అంతము కావు,
> అవి అనుదినము నూతనమగును,
> నీ విశ్వాసము గొప్పది,
> ప్రభువు నా భాగమైయున్నాడని నా ఆత్మ అంటుంది,
> గనుక, నేనాయనయందు నిరీక్షింతును.[2]

కడపటి ముఖ రూపము మంచితనము: "యెహోవా దయాళుడు" (వ. 25ఎ). గత మూడు లక్షణములు దేవుని మంచితనానికి సాక్ష్యమిస్తాయి. తన సృష్టిపట్ల ఆయన మనోభావాలు ఆయన జరిగించే కార్యాలకు అట్టడుగున గీయబడిన గీత మంచితనము లేక దయాళుత్వము. దేవుని అనుగ్రహము (మంచితనము) మారుమనస్సు పొందేలా ప్రేరేపించునదై, "ఆయన అనుగ్రహైశ్వర్యమును సహనమును దీర్ఘశాంతమును" తృణీకరించకుండాలని అపొస్తలుడైన పౌలు పలికాడు (రోమా 2:4). రోములోని క్రైస్తవులు దేవుని కనికరమందు కొనసాగే అవసరతలో, దేవుని అనుగ్రహైశ్వర్యానికిని, ఆయన కాఠిన్యానికిని మధ్యగల తారతమ్యాన్ని కూడ పౌలు సూచించాడు (రోమా 11:22).

"యెహోవా నా భాగమని" యిర్మీయా అనుకొనడానికి దేవుని మహాగొప్ప లక్షణములు ఆధారము కలుగజేశాయి (వ. 24ఎ). మామూలుగా, "భాగము" అనే పదము స్వాస్థ్యాన్ని సూచించడానికి వినియోగించబడుతుంది. సంఖ్యా. 18:20లో, లేవీయుడును యాజకుడునైన అహరోనుకు దేవుడు వివరించుతూ, తక్కిన గోత్రాలవలె తనకుగాని, లేవీయులకుగాని వాగ్దాన భూమిలో స్వాస్థ్యమివ్వబడదని తెలిపాడు. "ఇశ్రాయేలీయుల మధ్యను నీ పాలు నీ స్వాస్థ్యము నేనే" అని అన్నాడు.

జీవితానికి కావలసిన ప్రాథమిక అవసరతలే వాస్తవంగా లేకుండినప్పుడు, యెహోవా తన భాగమని యిర్మీయా సంతుష్టి పడుతున్నాడు. దేవుడు స్వాస్థ్యము – అతని ఆహారము, అతని వస్త్రములు, అతని నివాసము, అతని సమస్తము.

తరువాత వచనాలలో, దేవుడు ఎవరైయున్నాడు, ఆయన ఏమి చేశాడు అనే వాస్తవాలవైపు ప్రజల దృష్టిని మరల్చి, వారు ఆయనకు ఎలా లోబడాలో తెలుపుతున్నాడు.

## దేవుడు ఏమి చేయడు (లేక చేయనిదేమి)

సత్యాన్ని సరియైన రూపంలో (దృష్టిలో) పొందడానికి కొన్నిసార్లు దాన్ని వ్యతిరేకంగా ఆలోచించాలి లేదా తారతమ్యాలు తెలిపే పూర్వగాథనుండి చూడవలసియుంటుంది. 25నుండి 30 వచనాలవరకు దేవునికి మనం ఎలా లోబడాలి అనేదాన్ని చూడక ముందు, ఆయన ఏమి చేయడో ఆలోచన చేద్దాం,

> ప్రభువు సర్వకాలము విడనాడడు. ఆయన బాధపెట్టినను తన కృపా సమృద్ధినిబట్టి జాలిపడును. హృదయపూర్వకముగా ఆయన నరులకు విచారమునైనను బాధనైనను కలుగజేయడు. దేశమునందు చెరపట్టబడినవారినందరిని కాళ్లక్రింద త్రొక్కుటయు మహోన్నతుని సన్నిధిని నరులకు న్యాయము తొలగించుటయు ఒకనితో వ్యాజ్యమాడి వానిని పాడుచేయుటయు ప్రభువు మెచ్చు కార్యములు కావు (3:31–36).

దేవుడు తమవలె ఉండాలని జనులు తరాలుగా కోరుకుంటారు. ఆయా సందర్భాలలో వారు ఏమి చేస్తారో, అవే సందర్భాలలో దేవుడు అలాగే జరిగించాలని వారు ఎదురు చూస్తూ ఉంటారు. దేవుడు నరమాత్రునివంటివాడు కాదు గనుక యితరులు తమ్మును ఎలా చూచారో అలాగే వారిని చూడాలని ఎదురుచూడరు. తన న్యాయంలో దేవుడు బహు కఠినంగా వ్యవహరించినట్టు యూదా జనులు తలంచారు. వారిని బాధించినట్టు వారు ఆయనపై నేరము మోపేలా శోధింపబడ్డారు. యిర్మీయా విషయాన్ని కుదుటపెట్టాడు: ఇట్టివి – "ప్రభువు మెచ్చు కార్యములు కావు" (36బి). దేవుడు ఉత్తముడు (మంచివాడు) అని యిర్మీయా ప్రతిపాదన రుజువు చేస్తుంది.

*"ప్రభువు సర్వకాలము విడనాడడు" (31 వ.).* దేవుని దండన లేక శిక్షచేయడం తాత్కాలికమయ్యింది. తన ప్రజలను నిత్యము విడనాడునట్లు ఆయన స్వభావము అంగీకరించదు. ఆయన దయ, కరుణావాత్సల్యములను బట్టి, ఆయన క్రమశిక్షణ కొద్దికాలం మాత్రమే ఉంటుంది. దాని అర్థమేమంటే – ఆయన చేయు శిక్షను బట్టి దేవుని ప్రజలు బాధనొందినప్పుడు, అది వారి క్షేమముకొరకే చిత్రింపబడింది. ఎంతవరకు శిక్షించాలో, ఎప్పుడు దాన్ని ఆపాలో ఆయనకు బాగా తెలుసు.

"హృదయ పూర్వకంగా ఆయన నరులకు" విచారాన్ని కలిగించడు (33ఎ). "యిష్ట పూర్వకంగా" అనే హెబ్రీ పదానికి "హృదయ పూర్వకముగా" అనేది అక్షరార్థం.[3] తన జనులు బాధింపబడడం దేవునికి యిష్టముండదు. శిక్షించడంలా కన్పించేది వాస్తవంగా గాఢమైన ప్రేమయైయుంది. తన ప్రేమను కనికరమును అంగీకరించునట్టు వారి హృదయములు తెరుచులాగున ఆయన తన ప్రజలతో వ్యవహరిస్తాడు. దేవుని ప్రేమ

కొన్నిసార్లు కఠినంగా ఉంటుంది, కాని అది నిరంతరం తన ప్రజల క్షేమము కోరేది. మన జీవితాల్లో తన ఉద్దేశాలు సఫలమగునట్లు ఏ విధానాల్లో ఆయన తన ప్రేమను కనుపరచాలో ఆయనకు బాగా తెలుసు. తల్లిదండ్రుల ప్రేమవలె, అది కొన్నిసార్లు బాధాకరంగా ఉంటుంది – తనకు తన ప్రజలకు కూడ బాధాకరమే. ఆయన ఉద్దేశము బాధ కలిగించాలనేది కాదు.

పసివాడుగా ఉన్నప్పుడు, నా తల్లి నన్ను శిక్షించిన తరువాత, "ఇది నిన్ను బాధించేదానికంటె నన్నే ఎక్కువగా బాధిస్తుందని" ఆమె కొన్నిసార్లు అంటూ ఉండేది. నేను తండ్రినై నా బిడ్డలను క్రమశిక్షణలో పెట్టుకునే కాలం వచ్చేంతవరకు అది ఎలాగా నాకు అర్థం అయ్యింది కాదు. క్రమశిక్షణలో పెట్టే దేవుని ప్రేమను గ్రహించడానికి ఈ అనుభవం నాకు సహాయం చేస్తుంది.

*"దేశమునందు చెరపట్టబడినవారినందరిని కాళ్ల క్రింద" ఆయన త్రొక్కడు (34 వ.).* వారిని పట్టుకొనినప్పుడు శత్రుసేనలు వారిని ఏమి చేశాయో ఈ ప్రయోగం వర్ణిస్తుంది. బబులోనీయులచే యూదావారు క్రూరంగా బాధింపబడిన సంగతిని గూర్చి యిర్మీయా ఆలోచిస్తూ ఉండవచ్చు. తన ప్రజలకు శిక్షచేయడానికి దేవుడు బబులోనీయులను వాడుకున్నాడు. కాని వారి క్రూర కృత్యములు దేవునికి ఆపాదింపకూడదు. విషపూరితమైన వారి శత్రువులు తమ బంధీలను బాధించినదానిని బట్టి దేవుని నిందించ కూడదు.

*"నరులకు న్యాయము తొలిగించుట" ఆయన కిష్టమైన కార్యము కాదు (35ఎ వ.).* "మహోన్నతుని సన్నిధిని" అనేది మహోన్నతుని నామంలో ఏర్పరచబడిన న్యాయ సభను సూచించవచ్చు. అందులో ప్రజలందరు తమ విన్నపాన్ని వినిపించుకునే హక్కు కలిగియుంటారు. న్యాయమైన తీర్పులను జనులను తొలగించడం చెడ్డ ప్రభుత్వపు నాయకులకు సాధారణమే. ఈలాటి నేరం విషయంలో యూదా అధిపతులు సయితం దోషులైయున్నారు. ఇది దేవుని విధానం కాదు. అత్యున్నతమైన న్యాయస్థానంలో తన కేసు విచారింపబడడానికి దేవుడు ఎన్నడూ నిరాకరించడు. ప్రతి ఒక్కరు న్యాయంగాను, యథార్థంగాను వ్యవహరింపబడేలా ఆయన శ్రద్ధవహిస్తాడు. న్యాయమైన విచారణ జరుగకుండ చేశాడని ఎవడును ఆయనను నిందించకూడదు.

## దేవునికి నరులు ఎలా ప్రత్యుత్తరమియ్యాలి

సాధారణంగా, కష్టకాలములు, బాధ, నిరాశతో కూడిన కష్ట స్థితి, ఫిర్యాదు చేయడం, లేదా కొన్నిసార్లు దేవునికి విరోధంగా జనులు తిరుగుతూ ఉంటారు. మొదట్లో, యిర్మీయా అదే చేశాడు. ఏదియెలాగున్నా, దేవుని స్వభావాన్ని ధ్వనించడంవలన 3వ అధ్యాయం నూతన నిరీక్షణను చూపుతుంది.

> ఆయనయందు నేను నమ్మికయుంచుకొనుచున్నాను. తన్ను ఆశ్రయించువారియెడల యెహోవా దయాళుడు తన్ను వెదకువారియెడల ఆయన దయచూపువాడు. నరులు ఆశకలిగి యెహోవా అనుగ్రహించు రక్షణకొరకు ఓపికతో కనిపెట్టుట మంచిది. యౌవనకాలమున కాడి మోయుట నరునికి మేలు. అతనిమీద దానిని మోపినవాడు యెహోవాయే. గనుక అతడు ఒంటరిగా కూర్చుండి మౌనముగా ఉండవలెను

నిరీక్షణాధారము కలుగునేమో యని అతడు బూడిదెలో మూతి పెట్టుకొనవలెను. అతడు తన్ను కొట్టువానితట్టు తన చెంపను త్రిప్పవలెను. అతడు నిందతో నింపబడవలెను (3:24బి-30).

దేవుని నిజ స్వభావాన్ని గూర్చి అతడును జనులును గుర్తుచేయబడినవారై, కష్టకాలములలో దేవుని ప్రజలు ఎలా స్పందించాలో యిర్మీయా ప్రదర్శించాడు:

*"ఆయనయందు నమ్మిక యుంచుచున్నాను" (24 వ.).* నిరీక్షణా సందేశం యిర్మీయా యొక్క విలాపముల అడుగున దాగి ఉంది. "యెహోవాను నమ్ముకొనువాడు ధన్యుడు" (యిర్మీయా 17:7). ఒక స్థలములో అతడు నిరీక్షణకు ప్రభువుగాను, రక్షకునిగాను వ్యక్తీకరించాడు (యిర్మీయా 14:7, 8). మనం నిశ్చయముగా చెప్పలేమనుకో, అయితే యిర్మీయా కీర్తనలను (రచనను) కలిగి, వాటినుండి బలాన్ని పుంజుకున్నట్టు నేను తలంచగోరతాను. తాను వ్యక్తపరచిన కొన్ని సంగతులు దాదాపుగా కొన్ని కీర్తనల యొక్క అసలైన రూపాలుగా కన్పిస్తాయి. "... ఎవడు తన దేవుడైన యెహోవా మీద ఆశపెట్టుకొనునో వాడు ధన్యుడు" (కీర్తన. 146:5); "వీరును దేవునియందు నిరీక్షణగలవారై దేవుని క్రియలను మరువకయుండి ... ఆయన ఆజ్ఞలను గైకొనునట్లును ... నియమించెను" (కీర్తన. 78:5బి, 7బి).

నిరీక్షణా సందేశము క్రొత్త నిబంధనలో మరి తేటగా మ్రోగుతుంది. అందులో క్రీస్తు "మహిమను నిరీక్షణ"యైయున్నట్టు చెప్పబడింది (కొలస్సీ. 1:27బి). క్రీస్తునందు మనకున్న నిరీక్షణను గూర్చి యితర లేఖన భాగాలు కూడ నొక్కి చెప్పుతున్నాయి:

> మన ప్రభువగు యేసు క్రీస్తు తండ్రియైన దేవుడు స్తుతింపబడునుగాక, మృతులలో నుండి యేసుక్రీస్తు తిరిగి లేచుటవలన జీవముతో కూడిన నిరీక్షణ మనకు కలుగునట్లు ... ఆయన తన విశేష కనికరముచొప్పున మనలను మరల జన్మింపజేసెను (1 పేతురు 1:3).

> కాబట్టి విశ్వాసమూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా దేవునితో సమాధానము కలిగియుందము. మరియు ఆయన ద్వారా మనము విశ్వాసమువలన ఈ కృపయందు ప్రవేశముగలవారమై, అందులో నిలిచియుండి, దేవుని మహిమను గూర్చిన నిరీక్షణనుబట్టి అతిశయపడుచున్నాము. అంతే కాదు; శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగజేయునని యెరిగి శ్రమలయందును అతిశయపడుదము. ఎందుకనగా ఈ నిరీక్షణ మనలను సిగ్గుపరచదు. మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మద్వారా దేవునిప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడియున్నది (రోమా 5:1-5).

క్రీస్తు మనకు నిరీక్షణయైయున్నాడని స్థిరపరచుటలో తిమోతికి పౌలు తన తొలి పత్రికను ఆరంభించాడు (1 తిమోతి 1:1). ఈ నిరీక్షణ మనలను రక్షించగలదు (రోమా 8:24). ఓడకు లంగరు ఎలాటిదో ఆత్మకు నిరీక్షణ అలాటిదే (హెబ్రీ. 6:19). సిలువపై క్రీస్తు ప్రభువు మనకొరకు ఏమి జరిగించారో దానిచే మన నిరీక్షణ నిశ్చయమును స్థిరమునై యున్నది. "ఆయనయందు నేను నమ్మిక యుంచుకొనుచున్నాను" (విలాపవాక్యములు 3:24బి).

*"నరులు ఆశకలిగి యెహోవా అనుగ్రహించు రక్షణకొరకు ఓపికతో కనిపెట్టుట మంచిది" (26 వ.).* తన తప్పిదములకు దెబ్బలు తింటున్నప్పుడు, నరుడు చేయవలసిన అత్యుత్తమమైన పని మౌనంగా వాటిని అంగీకరించడమే (27, 28 వచనాలు). పాపిపై పాపము యొక్క ఫలితాలను దేవుడు రానిచ్చినప్పుడు, అది న్యాయమని అతనికి అభయమియ్యబడుతుంది. తనపై ఆ భారాన్ని మోపిన దేవుడే, దానినుండి వాని రక్షించు దేవుడైయున్నాడు. జీవితపు ఆరంభ దినాల్లోనే కష్టములలోనుండి పాఠాలు నేర్చుకొని మేలుపొందవచ్చు. అప్పుడు పొందిన జ్ఞానము మిగిలిన జీవిత కాలానికి ప్రయోజనకరంగా ఉంటుంది.

యిర్మీయా తన వ్యక్తిగత అనుభవములోనుండి మాట్లాడగలడు. దేవుడు అతనిని తన ప్రవక్తగా చిన్నతనంలోనే పిలుచుకున్నాడు. ఆ దేశ జనంతో పాటు తానును కష్టకాలం అనుభవించాడు. మౌనముగా దేవునియందు నమ్మికయుంచుటవలన అతడు సజీవంగా ఉంచబడ్డాడు. బాధింపబడిన యితరులకు తన సొంత అనుభవం ద్వారా హితవు దొరికింది.

*"అతడు బూడిదెలో మూతి పెట్టుకొనవలెను" (29ఎ వ.).* యిర్మీయా యిక్కడ ఏమి చెప్తుతున్నాడో మనం తేలికగా గ్రహించవచ్చు. దేవుని సన్నిధిని తన్నుతాను తగ్గించుకొని ఆయన యెదుట సాగిలపడి (సాష్టాంగ రూపంలో) అతని నోరు నేలను అంటుకొంటుంది. మహా విశ్వానికి మహామహుడగువాని యెదుట ఎదిరించి నిలబడడం, తన మహా దుఃఖాన్ని పొడిగించుకొనుటయే ఔతుంది. యూదాకు కలిగిన శ్రమానుభవం దేవునికి విరోధంగా తిరుగుబాటు చేసినందున కలిగినదే. ఈలాటి ఆకలికి విడుదల కొంత మట్టిని తినడమే.

"*అతడు తన్ను కొట్టువాని తట్టు చెంపను త్రిప్పవలెను*" *(30ఎ వ.).* పొందదగిన శిక్షను అంగీకరించుమని యిర్మీయా హితవు పలుకుతున్నాడు. ప్రభువైన యేసు యిలా అన్నారు: "నేను మీతో చెప్పునదేమనగా దుష్టుని ఎదిరింపక, నిన్ను కుడి చెంపమీద కొట్టువాని వైపునకు ఎడమచెంపకూడ త్రిప్పుము" (మత్తయి 5:39). 30వ వచనంలో కొట్టువానిగా సూచింపబడినది దేవుడే అయ్యుండవచ్చు లేదా యూదా దృష్టిని తన వైపునకు మరల్చుటకు ఆయన సాధనముగా ఉపయోగించుకున్న బబులోనై యుండవచ్చు. దుష్టుని ఎదిరింపక వాని చెంపదెబ్బను తీసికోమని ప్రభువు క్రైస్తవులకు బోధించారు. దెబ్బకు మరు దెబ్బ కొట్టకుండ నెమ్మదిగా అన్యాయపు శిక్షను మనం అంగీకరించవలసి యుంది. ఎందుకంటె మన విమోచన అన్యాయపు శ్రమనొందియే తేబడింది. మనము పొందవలసిన శ్రమను బెదిరించకుండనే మన రక్షకుడు అంగీకరించాడు. దేవుడు మన విషయమై పగతీర్చుకుంటాడు, ఆయన అందుకు చాలినవాడు, గనుక మనకు మనమే పగతీర్చుకొనవలసిన అవసరం లేదు (రోమా 12:19, 20).

అన్యాయంగా మనలను కొట్టినవానివైపు మరొక "చెంప" మనం తిప్పగలిగినట్టయితే, నీతియందు శిక్ష చేయువానినుండి పొందవలసిన శిక్షను అనుభవించడానికి మనం యింకా ఎంతగా యిష్టపడాలి?

## సందేశమేమి?

"ఎవరి వశంలో సమస్తం ఉంది?" అనేది జీవితపు పెద్ద సమస్యలలో ఒకటి. మన జీవితాలు మన వశములో ఉన్నాయని గొప్పగా గర్విస్తాం. మనం ఎలా కోరుకుంటామో అలా యితరులు నడుచుకొనేలా మల్చుతాం. ప్రజలను పరిస్థితులను వశపరచుకొనడం మనకు సౌఖ్యంగానే ఉంటుంది. ప్రతి ఒక్కరు ప్రతి విషయము ముందుగా నిర్ణయించబడిన, ముందుగా చెప్పబడిన విధానంలోనే కావాలని మనం కోరుకుంటాం. మనలను అలా జరిగించాలని కోరేవారు ఎవరు? మనం ఏలబడడానికి యిష్టపడం ఏలికలుగా ఉండగోరతాం!

ఇది మనం యిర్మీయా వద్దనుండి నేర్చుకోవాలి. ఏ వ్యక్తియు దేనిని వశపరచుకో లేడు: అతడు యిలా అన్నాడు,

> ప్రభువు సెలవులేనిది మాట యిచ్చి నెరవేర్చగలవాడెవడు? మహోన్నతుడైన దేవుని నోటనుండి కీడును మేలును బయలు వెళ్లునుగదా? సజీవులేల మూల్గుదురు? నరులు తమ పాపశిక్షనుబట్టి ఏల మూల్గుదురు (3:37-39).

బబులోను రాజు యూదాకు ఏలికగా ఉన్నా, అతడు దేనిని వశపరచుకోలేదు. దేవుడు నిజమైన ఏలికగా ఉన్నట్టు గుర్తించిన కొందరిలో యిర్మీయా ఒకడు. విశ్వానికి సృష్టికర్తయు పాలకుడైనవాని వశంలో సమస్తముంది. తమ జీవితాలను తామే నడిపించు కొనగలరనే భ్రమలో జనులు గడుపుతారు. దేవుని మార్గాలను ఏ నరుడును వశపరచుకో లేడనడానికి సహాయపడే యిర్మీయా ప్రశ్నలను ఆలోచన చేద్దాం.

మొదటిది, దేవుడు అది వానికి యివ్వనట్టయితే, నరుని మాట అనిశ్చయమై ఉంటుంది. 37వ వచనంలో యిర్మీయా యిలా అడిగాడు: "ప్రభువు సెలవులేనిది మాట యిచ్చి నెరవేర్చగలవాడెవడు?" దేవుడు లేకుండ నరుడు ఏమియు ఎరుగడు, తప్పుగా నడిపింపబడువాడైయుంటాడు. "ఒకడు తనకేమైనను తెలియుననుకొని యుంటే, తాను తెలిసి కొనవలసినట్టు ఇంకను ఏమియు తెలిసికొనినవాడు కాడు" (1 కొరింథీ. 8:2; 1 తిమోతి 6:3, 4 కూడ చూడు), నిశ్చయమైన మాట దేవుని యొద్దనుండియే వచ్చును.

రెండవది, "మహోన్నతుడైన దేవుని నోటనుండి కీడును మేలును బయలువెళ్లును గదా?" అని ప్రవక్త అడుగుతున్నాడు (38 వ.). తాను ఏమి చేస్తున్నది దేవునికే తెలుసు. ఆయన ఉద్దేశములు పరిపూర్ణమైనవి, ప్రశ్నకు అతీతమైనవి. ఈ సత్యాన్ని యోబు మరో విధంగా చెప్పాడు: "యెహోవా ఇచ్చెను యెహోవా తీసికొనిపోయెను, యెహోవా నామమునకు స్తుతి కలుగును గాక" (యోబు 1:21బి). దేవుడు సర్వమును ఏలువాడు. ఆయన దేవుడు. తాను ఏమి చేస్తున్నాడో సమస్తాన్ని ఆయన చెప్పనవసరం లేదు. చెట్టు నాటగోరి చీమల పుట్టను ఎందుకు త్రవ్వుతున్నామో చీమకు వివరించవలసిన అవసరత మనకు ఎలాగు లేదో, అలాగే ఆయన ఏ విధంగాను పూటపడియుండలేదు. మనం వివరింప ప్రయత్నించినా చీమ గ్రహించలేదు. మన ఉద్దేశాలు ఎంతగానో చీమను మించి ఉంటాయి. అయితే ఆయన ఉద్దేశాలు అనంతంగా నీతిగలవైయుంటాయి. చెరుపైనదిగా గోచరించే గాలి కూడా దీవెనగా మారవచ్చు. దేవుని నోటనుండి వచ్చు

మాట కఠినంగా ఉన్నట్టు కన్పించినా, బాధాకరంగా ఉన్నా, అన్నివేళ్లలా అది మనకు మంచిదిగానే ఉంటుంది. ఎందుకు అని ప్రశ్నించేది మన వంతు కాదు. దేవుడు ఏమి చేస్తున్నాడో దాన్ని ఎరిగి ఆయన కార్యములయందు నమ్మికయుంచి, ఆయన ఉద్దేశాలకు మనం లోబడాలి.

39వ వచనంలో 3వ ప్రశ్నను చూస్తాం: "నరులు తమ పాప శిక్షనుబట్టి ఏల మూల్గుదురు?" ఫిర్యాదు చేసే హక్కు మనకులేదు. అందులో ప్రత్యేకించి మనం అనుభవించేది మన దోష శిక్షయైనప్పుడు ఏ విధంగానైనా, పరిస్థితులకు మూల్గే హేతువు లేదు. ఫిర్యాదుకు బదులు, మన దృష్టిని తనవైపుకు మళ్లించడానికి ఆయన చేసినదానికి మనం ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. ఆత్మ సంబంధమైన తన స్థితిని చూచుకొనడానికి తార్సువాడైన సౌలును దేవుడు అంధుడగునట్లు కొట్టాడు (అపో. 9:1–19). ఫిలిప్పీ చెరసాల నాయకుని విషయంలో (అపో. 16:25–34) భూకంపము అతని ఆత్మ కంపమునకు దారి తీసింది.

తన ఉద్దేశాల కొరకు దేవుడు నిన్ను ఉపయోగించుకొనడానికి సిద్ధంగా ఉన్నావా? "నీ ఉద్దేశాలకు సాధనంగా నన్ను తీసికొని వాడుకోమని దేవునికి నీవు ప్రార్థించగలవా?" తన పనిలో నిన్ను అమర్చడానికి దేవుడు నీకు ఏమి చేయవలసియుంటుందో నీవు ఎరుగక పోవచ్చు. నీవు ఆలాగున ప్రార్థించితే, బాధ, శ్రమ, హృదయవేదన నీవు ఎదుర్కోవలసి యుండవచ్చు. అయితే నిశ్చయముగా ఆ తరువాత నీవు దీవెనను కనుగొంటావు. ఏమి సంభవించినా అది నీ మేలు కొరకును, దేవుని ఉద్దేశాలు నెరవేర్చబడడానికిని సంభవించుతాయి. అది చెడ్డ కానేరదు.

నీ జీవితం స్వాధీనంలో ఉండడానికి ఒకే మార్గం దేవుని చిత్తానికి దాన్ని అప్పగించు. దేవుడు నిజముగా ఉత్తముడన్న సత్యాన్ని నీవు కనుగొంటావు.

---

సూచనలు

[1]James E. Smith, *Jeremiah and Lamentations,* Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1974), 884. [2]Amy Bessire, "The Steadfest Love of the Lord," *Praise for the Lord,* ed. John P. Weigand (Nashville: Praise Press, 1992), 892. [3]Anthony Lee Ash, *Jeremiah and Lamentations,* The Living Word Commentary, ed. John T. Wills (Abilene, Tex.: ACU Press, 1987), 356.